

# దిగంతరేఖ

'వి. పాపయ్య'

ఎంత పెద్దదీ! ఎందుకింత పెద్దదీ? ఈ సముద్రం. అదుగో ఆ దూరాన దూరం కాని చాలాదూరాన సాగరపు టంచు ఆకాశము విడరాని అతుకుగా అంటుకొన్న ఆ దిగంత అనంత భూనభోచుంబనరేఖ, ఆ నిత్యసరళరేఖపైని మల్లెపూవుల మేఘాల తెప్ప గడుపుతూ విహరించనా? మనస్సా—! విహరించు.

కెరటాలు ఒడ్డుకువచ్చి తిరిగిపోతున్నాయి. విరామం వాట్లకి లేదు. విశ్రాంతి వాటి కవసరం లేదు. నురగనురగలతో కెరలుతూ, బుసకొట్టే పాముతలల్లా ఒకదాన్నొకటి తరుముకొంటూ తీరాన్ని పలకరించి గుల్లలను చిలకరించి పోతున్నాయి, దూరంగా, ఎందుకో? ఏమనో? ఊహాతీతమైన కాలయానంలో అలాంటి తరంగా లెన్ని కోట్ల కోటులు త్రెళ్లి తీరాన్ని ముద్దిడి, ఆ దిగంతరేఖను చేరుకొన్నదో? ఆ దిగంతవలయరేఖను నేను చేసుకొగలనా, అనంత కాలసాగరంలోని విచిత్రగాథలు, మహత్తర సన్నివేశా లెన్ని ఆ రేఖలో లీనమై పోయినవో చూడగలనా? ఎంతదూరం పోయినా, ఏ యెడమనుంచి చూచినా కనిపిస్తూన్నదే, పోయిన కొద్దీ దూరంగా పోతున్నదే, మరెల్లా చేరుకోవడం? అసలది ఉన్నట్టా, లేనట్టా? అదో రేఖకానిరేఖ, నిత్యరేఖ; అందదు, అందుకోలేను, అందుకోడానికి ఒక్కదగ్గిర, ఒక్కయెత్తులో లేదు, అంతటా వుంది గనుక.

తరంగాల్లో యేదో సౌందర్యం, యేదో పిలుపు కనుపించి వినిపించి కరిగిపోతూన్నవి. తరంగాలు తెల్లమల్లెపూల రాజసౌధాల్లా, వెన్నెల ఆకుల లతానికుంజాల్లా, జలకన్యల కేళీమందిరాల్లా మరింత సౌందర్యంగా కనిపిస్తున్నాయి. ఎన్నెన్ని మహాయుద్ధాల నావలు, వీరులు ఆ అలల క్రింద ఆడుకొంటున్నారో, యెంత చరిత్ర వాటి నురుగుల్లో నోరెత్తి విలపిస్తూందో? భూతకాలస్మృతి మధుర గీతాలు వినిపిస్తున్నవో.

ఈ నాగరికతా ప్రపంచపు ముండ్లబాటలూ కన్నీళ్ళ పిల్ల కాల్వలు, జైళ్లు, ఆకటిమంటలు, నిరంకుశాధికారకర్మలు, అవకతవకలూ, అడ్డంకులూ, ఆఫీసులు, కార్లు, కుర్చీలు, బెంచీలు, ఒకటా, ఎన్నో యెన్నో ముక్కముక్కల రంపపుపొట్టు వాతావరణంలోకంటె ఆ తరంగాల వుయ్యాలల్లో హాయిగా నిద్రిస్తే—ఆ రెండు కెరటాలమధ్య చక్కని గూడులో మల్లెపర్వతాల గుహ, లోయ, లతల్లా గుండ్రని వంపులతో లయతప్పని నాట్యకత్తెల రాసుల కెరటాలు యెంత సౌందర్యం చిలుకుతూన్నవో!! అదే, ఆ క్రీడాతరంగంలో స్వేచ్ఛగా పిల్లాడిలా ఆడుకొంటూ వుండిపోతే—యెంతహాయి, యీ ప్రాపంచిక గొడవలూ, యుద్ధవార్తలూ, యుద్ధప్రముఖులూ, అన్నీ మరచి ఆ తరంగసీమల్లో స్వర్గసీమని మరిచి స్వైర విహారంగావుంటే — అవిగో ఆహ్వానిస్తున్నాయి, రమ్మని,-త్రోవచూపేటట్లు ముందుకొచ్చి వెనక్కుమళ్లుతున్నాయి. నేలమీద దొరకలేని దేన్నో చూపిస్తామన్నట్లు. వాటిలోని సౌందర్యశోభలు అంతకంతకు పెంపొంది కళ్ళను చీల్చుకొని మనస్సును ఆక్రమించుకొంటున్నవి. తెంపులేని అనంతశృతితో ఆహ్వానగీతికాగానాన్ని నోరెత్తి పాడుతున్నవి. మెత్తని తెల్లవిరులశయ్యలవలె, నీటి చెట్టుకి విరిసిన మొగ్గలవలె నురుగులు విరిగి విచ్చిన వెన్నెల విరులవలె వెదజల్లగా, విరియబూచిన నిండారు మల్లెపందిరివలె, ముత్యాలపైరువలె, సముద్రకాంతలు కట్టుకొన్న తెల్లపట్టుపుట్టములవలె తరగలై, తారకలు, చంద్రుడు, సూర్యుడు కలసి కరిగిపోయినప్పటి పొంగువలె, నిండుయవ్వనపు పూబాలల కన్నులనుండి


కథాంజలి

అన్ని హిగ్గిన్‌బాథమ్సు బుక్‌స్టాల్సు లోను దొరకును. వెల 0-2-0

జారే చలత్కాంతుల జ్యోత్స్నల కలయికవలె, మరీచినీచికల మధుర నృత్యమువలె హిమవన్నగర శిఖరాగ్రములై గుంపులై వంపులై భూరమణీమతల్లి నీరాల కోకకు వెండి, వజ్రాల జరీ అల్లికలవూలుగా, హోరుతో పాడుతూ, జోరుతో ఆడుతూ చెప్పరాని ఆనందాన్ని అనుభవిస్తున్నవి. మరోచోట కనరాని తృప్తి ఆ తరంగాల్లోంచి రమ్మని పిలిచి నర్తించుతోంది. మనస్సు శరీరాన్ని వాటికి మరింత దగ్గరగా యీడ్చుకుపోయి, తరంగాల్లో కలిసి మెలిసి సుడులు తిరుగుతూ పైకెగుస్తూ దూరదూరాలకు పోయి దిగంత రేఖ వైపు సాగుతున్నది. మనస్సుని యేదో శక్తి లోబర్చుకొని శరీరాన్ని నడిపించుతోంది.

అబ్బ! ఎంత చల్లగావుంది, మోకాళ్లవరకూ తడిసిపోయింది. ఇంకా లోపలకు పోతే? ఇంకేముంది! యీత తెలియదాయెను. యీ పరాకులో, యింకా యింకా ఆ దిగంతరేఖకోసం సముద్రంలోకి జరిగితే యింకేమయినావుందా! అయినా నా కోసం యెవరూ యేడవరు—గాని నాకు యిష్టంలేదు.

ఇంతకూ-ఇలాంటిబుద్ధి-సముద్రాన్ని ప్రేమించి, దిగంతరేఖ అందుకోవలెనన్న బుద్ధి యెలా కలిగిందీ? అసలు బుద్ధి యెందుకు కలగాలీ?

ఆ బుద్ధిని స్వేచ్ఛగా వదలి, అవయవాలు అది చెప్పినట్టు చేస్తే యేమవుతుందీ? మేలుకొని మరో క్రొత్తబుద్ధిని చంపేస్తే సరిపోయింది. లేకపోతే?—ఓహో! బుద్ధులుకూడా తరంగాలే! మనిషికూడా సముద్రమే! ఆ తరంగాలకు పదిగజాలదూరంకి పైగా పరుగెత్తి నిల్చున్నాను. చాలా ధైర్యవంతుణ్ణి, సాహసుణ్ణి. ఔనా?

అయినా సందేహంతో ఆలోచనలు తరంగాలుగా కెళ్లుతున్నవి. బుద్ధి అనేది యెందుకుపుట్టాలి-వాటికి పరిపూర్ణ స్వేచ్ఛ యిస్తే, అధికారం యిస్తే?? దానికి లొంగివర్తిస్తే—అసలు జానంతటదే ఆకారణంగా యెందుకు మెదడులోకి రావాలనీ? అసలా బుద్ధులు యెందుకనీ???

సముద్రంలో ఆ తరంగాలెందుకనీ??? చంచలమూ, క్షణికమూ అయినా ఆ తరంగాలెన్ని కోట్లకయినా, యెందుకనీ??? ఆ తరంగాలకు కారణం???

ఎదురుగా దిగంతరేఖ నవ్వుతోంది, కనీ కనుపించకుండా. ఇసుకమీద చీకటివాన కురుస్తోంది—వెనక్కు తిరిగి నడుస్తున్నాను. వెనుక నుండి సాగరగానం రానురాను సన్నగిల్లిపోయింది. నగరులో కొచ్చాను, మేడలు, బళ్లూ, మనుషులూ, యెన్నోయెన్నో—గాని దిగంతరేఖ యెక్కడా కనిపించడంలేదు, నవ్వనూ లేదు—



శుక్లనష్టానికి వజ్రాయుధం
'లుకో'
కలలోను, మూత్రంలోను పోయే యెటువంటి శుక్లనష్టాన్నైనా నిల్పును. నీరైన వీర్యాన్ని గట్టిపరచి, వెన్నెముకను దృఢపరచి నపుంసకత్వము పోగొట్టి ఇంద్రియనాడులకు పటుత్వము, వీర్యకమలములకు బలము కలిగించి సంసారసుఖమనుభవింపజేయును. కొరవడని వీర్యవృద్ధినిచ్చి ముసలితనమును పోగొట్టును.
చిన్న ప్యాకెట్ రు. 3/- పెద్దది రు. 5/-
వి. పి. చార్జి రు. 0-12-0.
ది మెడికల్ ప్రాడక్ట్సు కంపెనీ,
పో. బా. 57, మద్రాసు.